సాక్షి
రాజన్న సిరిసిల్ల

శుక్రవారం । 17 । మార్చి । 2023



గోశాలకు రాజన్న కోడెలు

వేములవాడఅర్బన్: తిప్పాపూర్‌లోని రాజన్న 20 కోడెలను ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చౌటపల్లెకు చెందిన తిరుపతమ్మ గోశాలకు అందజేశారు.



సెకండియర్ పరీక్షలు ప్రారంభం

సిరిసిల్లఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ సెకండియర్ పరీక్షలు గురవారం ప్రారంభమయ్యాయి. 4,084 మందికి 3,958 మంది హాజరైనట్లు డీఐఈవో మోహన్ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
30.0/21.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేర నిరూపణలో రైటర్ల పాత్ర కీలకం



రైటర్లకు సూచనలిస్తున్న ఎస్పీ

సిరిసిల్లక్రైం: నేర నిరూపణ, శిక్షలు పడడంలో రైటర్ల పాత్ర కీలకమని ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. జిల్లాకు చెందిన వివిధ పోలీస్‌స్టేషన్ల రైటర్లకు గురువారం శిక్షణనిచ్చారు. ప్రతీ కేసు విషయంలో ఎస్‌హెచ్‌ఓలకు సహాయకారిగా ఉండాలని తెలిపారు. వివిధ కేసుల ఫైల్స్ నిర్వహణ, కేసుల దర్యాప్తులకు సంబంధించిన వివరాలను క్రమపద్ధతిలో ఉంచాలన్నారు. కేసుల నమోదులో పూర్తి వివరాలు ఉండాలన్నారు. నేరాలకు సంబంధించిన వివరాలు, ఇంటరాగేషన్ రిపోర్ట్‌ను సీసీటీఎన్‌ఎస్ సిస్టంలో అప్లోడ్ చేయాలని సూచించారు. ఏఎస్పీ చంద్రయ్య, సీఐ ఉపేందర్, స్టేషన్‌రైటర్లు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

సిరిసిల్లక్రైం: జిల్లాలో అక్రమంగా ఇసుక రవాణా, నిల్వలు చేసిన కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎస్సైలు మారుతి, పరశురామ్ ఆధ్వర్యంలో వేములవాడ పరిధిలోని కొడిముంజ(ఆర్‌అండ్‌ఆర్) కాలనీలో నిల్వ ఉంచిన 180 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక డంపులను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలను అతిక్రమించి వ్యాపారాలు, ఇతర పనులు చేస్తున్న వారి వివరాలు వాట్సాప్ నంబర్ 6303922572కు మెస్సేజ్ చేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

పెండింగ్ పనులపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

సిరిసిల్లటౌన్: మన ఊరు–మన బడి పనులు పెండింగ్ ఉంటే పూర్తి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ సూచించారు. స్థానిక ఆఫీస్‌లో గురువారం నిర్వహించిన జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశంలో అరుణ మాట్లాడారు. కంటిజబ్బుల నుంచి ప్రజలను రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కంటివెలుగు చేపడుతుందన్నారు. హరితహారంలో నాటే ప్రతీ మొక్కను సంరక్షించాలని సూచించారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం అనేక సంస్కరణలు, సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. పాడి యూనిట్లను లబ్దిదారులకు అందించాలన్నారు. మిషన్ భగీరథ అధికారులు ప్రతీ వారం మండలాల్లో తిరిగి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎండాకాలంలో నీటికష్టాలు రాకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని సూచించారు. విద్య, వైద్యం, ఆర్థికం, గ్రామీణాభివృద్ధి, నిర్మాణ పనులకు జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, వ్యవసాయంపై వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, మహిళా సంక్షేమంపై తంగళ్లపల్లి జెడ్పీటీసీ పూర్మాణి మంజుల, సాంఘిక సంక్షేమంపై బోయినపల్లి జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ అధ్యక్షత వహించారు. జెడ్పీ సీఈవో గౌతం రెడ్డి, జెడ్పీటీసీలు గట్ల మీనయ్య, నాగం కుమార్, మ్యాకల రవి, చీటి లక్ష్మణ్‌రావు, కొమిరిశెట్టి విజయ, వాణి, గుండం నర్సయ్య, గుగులోత్ కళావతి, కో–ఆప్షన్ సభ్యులు చాంద్‌పాషా, అహ్మద్ పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ రాజీనామా చేయాలి



ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థులు

సిరిసిల్లటౌన్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ చైర్మన్ జనార్దన్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ డిమాండ్ చేశారు. నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతూ, అక్రమాలకు పాల్పడిన అంశంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేపర్ లీకేజీ వ్యవహారంలో సీఐడీతో విచారణ చేపట్టి, బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ సంఘటనతో టీఎస్‌పీఎస్సీపై వేలాది మంది నిరుద్యోగులకు నమ్మకం పోయిందన్నారు. మంద అనిల్, కుర్ర రాకేశ్, పొట్లు సాయి, దినేశ్, భాస్కర్, శేఖర్, వేణు, కార్తీక్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వయో‘భారంగా’ విధులు

- అంగన్‌వాడీలకు దక్కని ఉద్యోగ విరమణ గౌరవం
- ఆరుపదుల వయస్సు దాటినా తప్పని విధులు
- రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని వేడుకోలు
- జిల్లాలో 400 మంది అరవై ఏళ్లు దాటిన సిబ్బంది



ఈ చిత్రంలో కనిపిస్తున్న అంగన్‌వాడీ టీచర్ సరోజనమ్మ. వయస్సు 67 ఏళ్లు. గంభీరావుపేట మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్నారు. వయసురీత్యా ఎన్ని ఇబ్బందులున్నా నిత్యం సెంటర్‌కు వెళ్లి విధులు నిర్వర్తిస్తున్నారు. ఆరోగ్యం సహకరించనప్పుడు అవస్థలు పడుతున్నారు. గౌరవప్రదమైన రిటైర్మెంట్ అవకాశం లేకపోవడంతో విధిగా విధులకు హాజరుకావాల్సి వస్తోంది. సరోజనమ్మ వంటి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు జిల్లాలో చాలా మంది ఉన్నారు.

జిల్లా సమాచారం..

ఐసీడీఎస్ ప్రాజెక్టులు	సిరిసిల్ల, వేములవాడ
అంగన్‌వాడీ కేంద్రాలు	587
60 ఏళ్లు పైబడిన టీచర్లు	220
60 ఏళ్లు పైబడిన ఆయాలు	180

గంభీరావుపేట(సిరిసిల్ల): చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం.. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీల పాత్ర ప్రధానం. ఆరోగ్య సలహాలు ఇవ్వడం.. పోలియో చుక్కలు వేయడం .. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు సర్వే.. ఎన్నికల సంఘం చేపట్టే వివిధ సర్వేలు అన్నింట్లో అంగన్‌వాడీలే ప్రధాన పాత్ర పోషిస్తుంటారు. 1975లో ఏర్పడిన అంగన్‌వాడీ వ్యవస్థలో కాలానుగుణంగా అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. కానీ ఉద్యోగ విరమణ విషయంలో ఎలాంటి మార్పు జరుగలేదు. ఫలితంగా జిల్లాలో చాలా మంది అంగన్‌వాడీ టీచర్లు 65 ఏళ్లు దాటిన వారు కూడా విధులకు హాజరవుతున్నారు. వీరికి ఎలాంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేకపోవడంతో విధి లేక విధులకు హాజరవుతున్నారు.

రెండు ప్రాజెక్టులలో..

రాజన్నసిరిసిల్ల జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. రెండు ప్రాజెక్టుల పరిధిలో 587 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో సుమారు 220 మంది అంగన్‌వాడీ టీచర్లు, 180 మంది ఆయాలు అరవై ఏళ్లు దాటినప్పటికీ విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వం ఎప్పటికైన గౌరవప్రదమైన విరమణ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించకపోతుందా.. అని ఎదిరిచూస్తున్నారు. రిటైర్మెంట్ అవకాశం లేకపోవడంతో విధులు నిర్వర్తించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లుగా టీచర్లుగా, ఆయాలుగా పనిచేస్తున్న వారు ఆర్థిక అవసరాల నేపథ్యంలో పనిచేస్తున్నారు.

పారితోషికం నామమాత్రమే..

రిటైర్మెంట్ తీసుకోవాలనుకునే అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వం గౌరవ పారితోషికంగా రూ.60వేలు, ఆయాలకు రూ.30వేల చొప్పున అందజేస్తుంది. ఈ విషయంలో ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అనారోగ్య సమస్యలు వెంటాడుతున్న సెంటర్ వరకు వెళ్లడానికి ఇబ్బందిగా ఉన్నా.. ఆన్‌లైన్ పనులు చేయడం వీరికి భారంగానే మారింది. ప్రభుత్వం గౌరవప్రదమైన ఉద్యోగ విరమణ అవకాశం కల్పించి రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని ఉద్యోగులు కోరుతున్నారు. విరమణ సమయంలో టీచర్లకు రూ.5లక్షలు, ఆయాలకు రూ.3లక్షల చొప్పున బెనిఫిట్స్ అందించాలని డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా విధి నిర్వహణలో చనిపోతే రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరుతున్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందనే ఆశతో ఉన్నారు.

అనారోగ్య సమస్యలు వస్తున్నాయి



చాలా ఏళ్లుగా అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్నాను. అనారోగ్య సమస్యలు ఉన్నప్పటికీ డ్యూటీకి హాజరుకావాల్సి వస్తోంది. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా మాక్కూడ గౌరవప్రదమైన రిటైర్మెంట్‌కు అవకాశం కల్పించాలి.

– హిమాదేవి, అంగన్‌వాడీ టీచర్, కొత్తపల్లి

రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలి



ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ తర్వాత ఎలాంటి బెనిఫిట్స్ కల్పిస్తున్నారో మాక్కూడ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పింఛన్ సౌకర్యం కల్పించాలి. రిటైర్మెంట్ తర్వాత పింఛన్ ఇస్తే మా కుటుంబాలకు అన్ని విధాలా అవసరాలు తీరుతాయి.

– అంబవ్వ, అంగన్‌వాడీ ఆయా, కొత్తపల్లి

డిమాండ్లు నెరవేర్చాలి



అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలను, డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలి. 60 ఏళ్లు పైబడిన ఉద్యోగులకు రిటైర్మెంట్ అవకాశం కల్పిస్తూ, బెనిఫిట్స్ కల్పించాలి. టీచర్లకు రూ.5లక్షలు, ఆయాలకు రూ.3లక్షల చొప్పున రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి. వాలంటరీ రిటైర్మెంట్ తీసుకునే వారి ఇంట్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలి.

– చందన, అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు

గురుకులం వద్ద ఉద్రిక్తత



గిరిజన పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి నాయకులు, విద్యార్థినుల కుటుంబ సభ్యులు

- విద్యార్థినుల అస్వస్థతతో ఆందోళనలో తల్లిదండ్రులు
- విద్యార్థి సంఘాల నాయకులను అడ్డుకున్న పోలీసులు
- పోలీస్ హెడ్‌క్వార్టర్‌కు తరలింపు



ప్రిన్సిపాల్‌ను ప్రశ్నిస్తున్న విద్యార్థి నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీ పరిధిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల వద్ద గురువారం ఉద్రిక్తత నెలకొంది. పాఠశాలలో బుధవారం రాత్రి ఫుడ్ పాయిజన్ జరిగి 80 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల వద్దకు గురువారం ఉదయం చేరుకున్నారు. కాంగ్రెస్, ఏబీవీపీ, ఎస్‌ఎఫ్‌ఐ, బీఎస్పీ పార్టీల నాయకులు, విద్యార్థి నాయకులు ఆందోళనకు దిగారు. తమను లోపలికి అనుమతించాలని విద్యార్థినులతో మాట్లాడేందుకు అవకాశం కల్పించాలని కోరగా.. పోలీసులు అడ్డుకున్నారు. డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు ఆధ్వర్యంలో తంగళ్లపల్లి, నేరెళ్ల, చీర్లవంచ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు స్నేహ, రేఖ, రామకృష్ణ పర్యవేక్షణలో 24 గంటలపాటు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. తంగళ్లపల్లి ఎంపీపీ పడిగెల మానస, సర్పంచ్ బైరి శ్రీవాణితో కలిసి పాఠశాలను సందర్శించారు. కాగా విద్యార్థినుల అస్వస్థతకు కారణం తాగునీరు కారణమని అధికారులు గుర్తించారు. ఆర్వో ప్లాంట్ అందుబాటులో లేదనే విషయం తెలుసుకున్న కలెక్టర్ అనురాగ్ జయంతి వెంటనే ఆర్వో ప్లాంట్‌ను మంజూరు చేసినట్లు తెలిసింది.

ఆర్సీవోను నిలదీసిన విద్యార్థి నాయకులు

గిరిజన గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్(ఆర్సీవో) డి.ఎస్.వెంకన్నను విద్యార్థి సంఘాల నాయకులు నిలదీశారు. జిల్లాలోని గురుకులాల్లో వరుస సంఘటనలు జరుగుతుంటే ఏం చేస్తున్నారంటూ ప్రశ్నించారు. తన నియోజకవర్గంలోని విద్యార్థుల బాగోగులను మంత్రి కేటీఆర్ పట్టించుకోవడం లేదంటూ ఆరోపించారు.

విద్యార్థి నాయకుల అరెస్టు

ఎంత నచ్చజెప్పినప్పటికీ వినకపోవడంతో సిరిసిల్ల టౌన్ సీఐ అనిల్‌కుమార్, రూరల్ సీఐ ఉపేందర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో విద్యార్థి సంఘాలు, కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జాలగం ప్రవీణ్(టోని), భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్, రంజిత్, మునిగెల రాజు, చుక్క రాజశేఖర్, శేఖర్, ప్రేమ్, భాస్కర్, విజయ్, నిషన్, మహేశ్ ఉన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌కు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, గిరిజన గురుకులాల రీజినల్ కో–ఆర్డినేటర్ వెంకన్న, ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఈమేరకు తంగళ్లపల్లి నాయబ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రశాంత్ మాట్లాడుతూ జిల్లాలోని గురుకులాలో వరుస సంఘటనలు జరుగుతున్నా పట్టించుకునే వారు లేరన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి నాయకులు అనిల్, రాకేశ్, నర్సింహులు, కార్తీక్ ఉన్నారు.

మెరుగైన చికిత్స అందించాలి : రవిగౌడ్

బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. విద్యార్థి నాయకులు ఇల్లందు ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

విచారణ చేపట్టాలి: మంత్రి సత్యవతి రాథోడ్

గురుకుల విద్యాలయంలో ఫుడ్‌పాయిజన్ సంఘటనపై విచారణ చేపట్టాలని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్ ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం పూర్తిగా మెరగయ్యే వరకు మెడికల్ క్యాంపు కొనసాగించాలని సూచించారు.

ప్రశ్నించే గొంతుకలను నొక్కుతున్నారు

- మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి



పోడు భూములను పరిశీలిస్తున్న చాడ వెంకటరెడ్డి

సిరిసిల్లటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రశ్నించే గొంతుకలను నొక్కుతున్నాయని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. సిరిసిల్లలోని కార్మికభవన్‌లో గురువారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి డెబ్బై ఏళ్లు గడుస్తున్నా నిరుపేదలకు పక్కా ఇళ్లు లేవని, ఉచిత వైద్యం, విద్య అందడం లేదన్నారు. నిరుద్యోగులు, రైతులు, కార్మికులకు బతుకు దెరువు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడి తొమ్మిదేళ్లు గడుస్తున్నా పేదలకు పక్కా ఇళ్లు, అర్హులకు రేషన్‌కార్డులు, పెన్షన్లు దక్కకపోవడం శోచనీయమన్నారు. నిరుద్యోగ భృతిపై, ప్రజాసమస్యలపై పోరాడుతామన్నారు. ఏప్రిల్ 14 నుంచి పల్లెపల్లెకు సీపీఐ చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా కార్యదర్శి గుంటి వేణు, కడారి రాములు, పంతం రవి, అనసూయ, సుదర్శన్, లక్ష్మణ్, మల్లేశం, అమీనాబేగం పాల్గొన్నారు.

పోడుభూముల పరిశీలన

కోనరావుపేట(వేములవాడ): కోనరావుపేట మండలం మరిమడ్లలోని దళితుల పోడు భూములను వెంకటరెడ్డి పరిశీలించారు. ముందుగా గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని 80 మంది దళిత కుటుంబాలు సాగుచేసుకుంటున్న 100 ఎకరాల పోడు భూములను రైతులతో కలిసి పరిశీలించామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, మల్యాల జాన్సన్, జంగం అంజయ్య, కడారి రాములు, రైతులు దిలీప్, రాజనర్సయ్య ఉన్నారు.





ఘనంగా పెద్దమ్మతల్లి బోనాలు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని గూడెంలో పెద్దమ్మ–పెద్దిరాజుల సిద్ధోగంలో భాగంగా గురువారం రాత్రి బోనాలు తీశారు. దప్పుచప్పుళ్ల మధ్య అమ్మవారికి బోనాలను తీసుకెళ్లారు. బైండ్ల కళాకారులు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. శుక్రవారం జరిగే పెద్దమ్మ, పెద్దిరాజుల కల్యాణానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ముదిరాజ్ సంఘం బాధ్యులు దుద్దెడ రాజు, శాద సత్యనారాయణ, గూడూరి బాబు, గీస రాజు, ప్రసాద్ తెలిపారు. ఉపసర్పంచ్ శాద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ సారూ.. ఇదేమి న్యాయం ?

- బీఆర్‌ఎస్ వేధింపులతోనే రాజీనామా
- పెద్దూరు పీఏసీఎస్ చైర్మన్ బర్కం వెంకటలక్ష్మి
- నేడు బలనిరూపణ సమావేశం



జిల్లా సహకార అధికారికి రాజీనామాపత్రం అందిస్తున్న బర్కం వెంకటలక్ష్మి

సిరిసిల్లటౌన్: ‘మీ చెల్లెలు..ఈడి విచారణ అనగానే..మహిళలకు సాధికారత బిల్లు అంటూ ఢిల్లీలో కూసుంటుంది. మరీ నీ నియోజకవర్గంలో మహిళా సాధికారతకు లేదా గౌరవం.. కేటీఆర్ సారూ.. ఇదేమీ న్యాయం..’ అంటూ పెద్దూరు పీఏసీఎస్ చైర్మన్ బర్కం వెంకటలక్ష్మి యాదవ్ ప్రశ్నించారు. గురువారం జిల్లా సహకార అధికారికి తన రాజీనామా పత్రాన్ని అందించారు. అనంతరం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇరువై రోజులుగా అధికార పార్టీ నేతలు అవిశ్వాస తీర్మానం పెట్టాలని కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతుంటే తనకు పదవిపై వ్యామోహం లేదని నిరూపించేందుకే రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పీఏసీఎస్ చైర్మన్‌గా ఉన్న తనను అధికార పార్టీ డైరెక్టర్లు అవమానాల పాలు చేశారని ఈ సందర్భంగా ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తాను రాజీనామా చేసినప్పటికీ రైతుల పక్షాన నిలబడతానన్నారు. అధికార పార్టీ అక్రమాలను బయటపెడతానని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, బూర విష్ణుప్రసాద్, మహిళా మోర్చా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పెద్దూరు సింగిల్‌విండో కార్యవర్గ సమావేశం

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరు పీఏసీఎస్ కార్యవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించనున్నారు. గత నెల 28న సింగిల్‌విండో చైర్‌పర్సన్ బర్కం వెంకటలక్ష్మిపై 10 మంది డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానానికి డీసీవో బుద్ధనాయుడికి నోటీసు అందజేశారు. అప్పటి నుంచి వారు శిబిరానికి తరలివెళ్లారు. 17వ తేదీన బలపరీక్ష నిరూపణకు కార్యవర్గ సమావేశాన్ని డీసీవో ఏర్పాటు చేయగా, ఒక్క రోజు ముందే బర్కం వెంకటలక్ష్మి తన పదవికి రాజానామా చేశారు. శుక్రవారం 11 గంటలకు కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు డీసీవో తెలిపారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

- వేములవాడ కూడళ్లను సుందరీకరించాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: రాజన్న ఆలయ అభివృద్ధి విస్తరణ, సుందరీకరణ పనులను త్వరగా చేపట్టాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని అభివృద్ధి పనుల పురోగతిపై మున్సిపల్, మిషన్ భగీరథ ఇంజినీర్లు, ప్రజారోగ్య విభాగం ఇంజినీర్లు, వీటీడీఏ అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఆలయంలో అన్ని పనులను మాస్టర్‌ప్లాన్ ప్రకారం చేపట్టాలని సూచించారు. గుడిచెరువు బండ్ అభివృద్ధి, సుందరీకరణ పనులను టూరిజం అధికారులతో కలిసి చేయాలని సూచించారు. నాంపల్లి గుట్టపై ధర్మగుండం అభివృద్ధి చేసి, రాక్‌లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. మూలవాగు బండ్ పెండింగ్ పనులను పూర్తి చేసి, సుందరీకరణ పనులను మున్సిపల్‌కు అప్పగించాలని ఇరిగేషన్ ఇంజినీర్లకు తెలిపారు. వేములవాడలోని జంక్షన్ల అభివృద్ధి పనులను వారంలోగా పూర్తి చేయాలన్నారు. స్ట్రీట్ వెండర్ మార్కెటింగ్ పనులను గ్రౌండింగ్ చేయాలన్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. సినారె కళామందిరం పనులకు వారంలోగా టెండర్లు పూర్తి చేసి పనులను ప్రారంభించాలన్నారు. ఏప్రిల్ 14 వరకు మోడల్ స్కూల్ బిల్డింగ్ పనులను ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. రాజన్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఆర్డీవో పవన్‌కుమార్, ఇరిగేషన్ ఈఈ అమరేందర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్యామ్‌సుందర్, పంచాయతీరాజ్ ఈఈ సూర్యప్రకాశ్, మున్సిపల్ కమిషనర్ అన్వార్, తహసీల్దార్ రాజు, వీటీడీఏ సెక్రెటరీ భుజంగరావు, ఎస్టేట్ అధికారి సత్యనారాయణ ఉన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు



సరుకులు పరిశీలిస్తున్న డీఈవో

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లిలోని కేజీబీవీ పాఠశాలను జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం వివరాలు, చదువు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. స్పెషలాఫీసర్ నీలిమ, సెస్ డైరెక్టర్ మల్లేశం, ఉపసర్పంచ్ రవి ఉన్నారు.

అత్యుత్తమ మార్కులు సాధించాలి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): అభ్యాస దీపికలను పూర్తిగా చదివితే పదోతరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించడం సాధ్యమని డీఈవో రమేశ్‌కుమార్ సూచించారు. తంగళ్లపల్లిలోని ప్రభుత్వ పాఠశాలను గురువారం సందర్శించారు. డీఈవో మాట్లాడుతూ పరీక్షలపై భయాందోళనలకు, ఒత్తిడికి గురికావద్దని కోరారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. హెచ్‌ఎం దూస గోవర్ధన్ ఉన్నారు.

క్లుప్తంగా

రంజాన్ మాసంలో నియమాలు పాటించండి


ఖురాన్ నియమాలు వివరిస్తున్న వక్తలు

వేములవాడ: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు కురాన్ సూచించిన నియమాల ప్రకారం మెదులుకోవాలని పలువురు మత పెద్దలు సూచించారు. వేములవాడలో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పట్టణానికి చెందిన మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రధాన వక్తలు కరీంనగర్, రాజన్నసిరిసిల్ల జిల్లాల నుంచి వచ్చినట్లు ముస్లిం కమిటీ అధ్యక్షుడు అక్రమ్ తెలిపారు.

టాయిలెట్ల నిర్మాణానికి భూమిపూజ


కంపోస్ట్ షెడ్ వద్ద టాయిలెట్లకు కొలతలు ఏర్పాటు చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్

సాక్షి స్పందన

చందుర్తి (వేములవాడ) : పనులు చేయకుండానే రూ.41,660 ఉపాధిహామీ నిధులను స్వాహా చేసిన ఘటనపై అధికారులు స్పందించారు. ఇదే విషయంపై ఈనెల 14న 'అందినంత దోసుడే' అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. గురువారం మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలోని కంపోస్ట్ షెడ్ వద్ద టాయిలెట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రెండున్నర సంవత్సరాల క్రితం డబ్బులు డ్రా చేసిన విషయం నర్సింగాపూర్‌లో చర్చనీయాంశంగా మారింది.

ఒకరిపై రౌడీషీట్

రుద్రంగి (వేములవాడ): మండల కేంద్రానికి చెందిన నేవూరి కిషన్‌పై రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు ఎస్సై ప్రభాకర్ పేర్కొన్నారు. కిషన్ 2020, 2021 సంవత్సరాల్లో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. 2022లో నేవూరి నర్సయ్యను భూతగాదాల నేపథ్యంలో ట్రాక్టర్‌తో ఢీకొట్టడంతో మృతిచెందాడని, అందుకు రౌడీ షీట్ ఓపెన్ చేశామని తెలిపారు.

టీచకుడు!

- మహిళా సిబ్బందిని వేధిస్తున్న ఇటిక్యాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్
- నిత్యం ఉద్యోగినుల శరీరాలు తాకేందుకు తహతహ
- ఆగడాలు భరించలేక వీడియోలు తీసిన సిబ్బంది
- వీడియోలను కలెక్టర్ కార్యాలయానికి పంపిన 'సాక్షి'
- సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించిన కలెక్టర్ యాస్మిన్

సాక్షి ఎక్స్‌క్లూజివ్

సాక్షిప్రతినిధి, కరీంనగర్: అతనో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన అతను దారి తప్పాడు. తరగతి గదిలో పాఠాలు చెప్పాల్సింది పోయి.., తోటి మహిళా సిబ్బందిపై కన్నేస్తున్నాడు. తన కోరిక తీర్చాలంటూ పరోక్షంగా వేధిస్తున్నాడు. మాట వినకుంటే మహిళా సిబ్బందిని వేధిస్తూ తన ప్రతీకారం తీర్చుకుంటున్నాడు. మొత్తానికి 'కామా తురాణం న భయం..' అన్న మాటలను మరోసారి తన చేష్టలతో రుజువు చేస్తున్నాడు. పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ తోటి మహిళా సిబ్బందిని తన కామకోరికలు తీర్చాలంటూ వేధించే ఈ కీచక గురువుపై ఉన్నతాధికారులకు ఇటీవల వరుస ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అతని తప్పులను ఆధారాలతో సహా అటు హైదరాబాద్‌కు, ఇటు జగిత్యాల ఉన్నతాధికారులకు అందించారు. అతని ఆగడాలకు సంబంధించిన ఆధారాలను 'సాక్షి' కూడా కలెక్టర్‌కు పంపడంతో సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు.


మహిళా సిబ్బంది మీద చేయి వేస్తున్న శ్రీనివాస్

తాకేందుకు తహతహ

ఈ వ్యవహారంలో కీచక గురువు పేరు ఎం.శ్రీనివాస్. జగిత్యాల జిల్లాలోని రాయికల్ మండలం ఇటిక్యాలలోని మోడల్ కాలేజీకి ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఇతను మహిళా సిబ్బందితో విచిత్రంగా ప్రవర్తిస్తున్నాడు. మహిళలు ఒంటరిగా దొరికితే ఏదో వంకతో తాకేందుకు తహతహలాడుతున్నాడు. పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ ఇదేం పాడు బుద్ధిరా అని మిగిలిన సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. కొత్తలో అతనిది కేవలం మితిమీరిన క్రమశిక్షణ అనుకున్నామని.. కానీ, పోను పోను అతని అసలు ఉద్దేశం అర్థమైందని చెబుతున్నారు. తన దారికి రాని మహిళలను క్రమశిక్షణ పేరుతో వేధిస్తున్నాడని మిగిలిన టీచర్లు వాపోతున్నారు. నిమిషం ఆలస్యమైనా మెయిన్ గేట్లు వేసేస్తున్నాడని, అందరి ముందు పరువు తీసేలా కించపరుస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎదురు తిరిగితే తమను రకరకాల కారణాలు చెప్పి వేధిస్తున్నాడని, పనిచేసే చోట ఇలాంటి వాతావరణం తమకు తీవ్ర ఆందోళన కలగజేస్తోందని వాపోతున్నారు. ఒక దశలో అతని ఆగడాలు భరించలేక ఏకంగా అతని పైత్యపు చేష్టలను వీడియో తీశారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు..!

శ్రీనివాస్ తిక్క చేష్టలపై అతని కింద పనిచేస్తున్న సిబ్బంది మొత్తం కలిసి ఇటీవల ఉన్నతాధికారులకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. అతను పాఠశాలలో ప్రవర్తిస్తున్న తీరును క్షుణ్ణంగా వివరిస్తూ.. ఫిబ్రవరి ఆఖరు వారంలో అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మోడల్ స్కూల్, కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌లకు రిజిస్టర్‌పోస్టు ద్వారా కలెక్టర్ జగిత్యాల, డీఈవోలకు నేరుగా ఫిర్యాదులను అందజేశారు. తమను స్వేచ్ఛగా పనిచేయకుండా చేస్తోన్న సదరు ప్రిన్సిపాల్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. తను కాలేజీలో మహిళలను వేధిస్తుండగా తీసిన వీడియోలు, ఫొటోలను ఫిర్యాదుకు జతచేశారు.

ఫిర్యాదులో ఇంకేమున్నాయంటే..?

- స్టాఫ్ రూంలో మహిళలు ఒంటరిగా కనిపిస్తే వారిని తాకేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఫిర్యాదు కాపీకి అందజేశారు.
- పదో తరగతి విద్యార్థుల నుంచి నిర్ధారిత ఫీజుల కన్నా అదనంగా వసూలు చేస్తున్నాడు.
- విద్యార్థుల నుంచి పారిశుధ్య చార్జీలు అంటూ డబ్బులు వసూలు చేస్తున్నాడు. అలా వసూలు చేసిన మొత్తాన్ని కాలేజీ ఖాతాలో జమచేయడం లేదు.
- చిన్న కారణాలకే విద్యార్థులను ఇష్టానుసారంగా గొడ్లను బాదినట్లు బాదుతున్నాడు. ఇటీవల ఓ విద్యార్థిని చావబాదితే.. అతని తల్లిదండ్రులు పాత కలెక్టర్ రవికి ఫిర్యాదు చేశారని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు.

సస్పెండ్ చేస్తున్నాం: కలెక్టర్ యాస్మిన్ భాషా

ఈ నేపథ్యంలో సదరు గురువు మహిళలను కళాశాలలోనే అసభ్యకరంగా తాకుతున్న వీడియోలు 'సాక్షి'కి చేరాయి. ఈ వీడియోలను జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ భాషాకు 'సాక్షి' చేరవేసింది. ఈ దృశ్యాలను చూసిన కలెక్టర్ స్పందించారు. వెంటనే సదరు మోడల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు.

పోలీసుల అదుపులో అనుమానితులు


అనుమానితులను పట్టుకున్న గ్రామస్తులు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి చంద్రంపేటలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను గ్రామస్తులు పట్టుకున్నారు. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం అర్ధరాత్రి సమయంలో చంద్రంపేటలోని ఐసీఐసీఐ బ్యాంక్ సమీపంలో ఇద్దరు అనుమానాస్పదంగా తచ్చాడుతున్నారు. వీరిని గమనించిన బ్యాంక్ సెక్యూరిటీ తిరుపతి స్థానికులకు సమాచారం అందించగా వారిని పట్టుకున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు సమాచారం.

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం

సిరిసిల్లటౌన్/వేములవాడ: వేములవాడలో ఉరుములతో కూడిన చిరుజల్లులు కురిశాయి. గురువారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉండగా సాయంత్రం వర్షం కురిసింది. పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అకాల వర్షంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.

సిరిసిల్లలో...

జిల్లా కేంద్రం చిరుజల్లులు కురిశాయి. సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో అరగంట పాటు వర్షం కురిసింది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో ఉపశమనం లభించినట్లయింది.

వ్యవసాయానికి నిరంతర విద్యుత్


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి (సిరిసిల్ల): తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి నిరంతర విద్యుత్‌ను అందిస్తున్నట్లు సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, టిస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గురువారం సెస్ వినియోగదారుల కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల విద్యుత్ సరఫరాతో భూగర్భజలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందన్నారు. సిరిసిల్ల సెస్ పరిధిలో రైతుల డిమాండ్ మేరకు 18 గంటల నిరంతర విద్యుత్ అందిస్తున్నామన్నారు. విద్యుత్ సమస్యలుంటే సెస్ డైరెక్టర్ల దృష్టికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు నాగరాణి, అనసూయ, నాయకులు జబ్బర్, నర్సింహా రెడ్డి, బాల్‌రెడ్డి, బాల్‌రాజు, రాజం, రాజునాయక్ ,రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం..

వీర్నపల్లి: రైతులు, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తామని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో ఉమ్మడి మద్దిమల్ల గ్రామాలకు సపరేట్ ఫీడర్‌ను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దాదాపు రూ.24 లక్షలతో 5 కిలో మీటర్ల మేర స్తంభాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ భూల, జెడ్పీటీసీ కళావతి, ఎంపీటీసీ అరుణ్ కుమార్, ఉపసర్పంచ్ రవి, తహసీల్దార్ తఫాజుల్ హుస్సేన్, మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, ఎంపీవో నరేశ్, సెస్ ఏఈ దివ్య, ఉపసర్పంచ్ రవి, తదితరులున్నారు.

బాలకార్మికుల నిర్మూలనకు కృషిచేయాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి


మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్లఅర్బన్: బాల కార్మికుల నిర్మూలనకు కృషిచేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్‌లో వెట్టిచాకిరీ విజిలెన్స్ కమిటీ, బాలల, కౌమార పిల్లల కార్మిక నిర్మూలన కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖల సమన్వయంతో మండలాల్లో టాస్క్ పోర్స్ కమిటీని ఏర్పాటు చేసి పాఠశాలలో తక్కువ హాజరుశాతం ఉన్న పిల్లలను గుర్తించాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులు, వారి పిల్లల విషయంలో గ్రామ పంచాయతీ, మున్సిపల్ శాఖ అధికారులతో తనిఖీలు నిర్వహించి, పోలీస్, లేబర్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, అదనపు ఎస్పీ చంద్రయ్య, బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ అంజయ్య, కార్మిక శాఖ అధి కారి ఎండీ రఫీ, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, డీఈవో రమేశ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, వ్యవసాయ శాఖ అధికారి రణధీర్, పౌర సరఫరాల శాఖ అధికారి జితేందర్ రెడ్డి, బీసీ, ఎస్టీ అభివృద్ధి శాఖ అధికారి మోహన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, డీసీపీవో స్వర్ణలత, తదితరులున్నారు.

విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహించాలి


డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

సిరిసిల్ల ఎడ్యుకేషన్ : జిల్లాలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహించాం, ప్రాథమిక స్థాయి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించేందుకు అనుమతివ్వాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్‌రెడ్డి గురువారం డీఈవో రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. 2022 వేసవి సెలవుల్లో ఇంటర్ విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవులు, దసరా సెలవుల్లో సీడబ్ల్యూఎస్ఎన్ శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులకు సీసీఎల్ మంజూరు చేయాలని కోరారు. వేసవి దృష్ట్యా పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల సమయాన్ని కుదించాలన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుమాల రామ్‌నాథ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పురం వాసుదేవరావు, మల్లారపు పురుషోత్తం, సత్తు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ చేయూత


చెక్కులను అందజేస్తున్న ఎంపీపీ గంగం స్వరూపారాణి, జెడ్పీటీసీ మీనయ్య

రుద్రంగి (వేములవాడ): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతీ కుటుంబానికి ఏదో విధంగా చేయూత లభిస్తుందని ఎంపీపీ గంగం స్వరూపారాణి, జెడ్పీటీసీ గట్ల మీనయ్య పేర్కొన్నారు. నక్సలైట్ల చేతిలో ఇన్‌ఫార్మర్ల పేరుతో చనిపోయిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5లక్షల ఆర్థికసాయం చెక్కులను గురువారం అధికారులు, నాయకులతో కలిసి తహశీల్దార్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుగులోతు చిన్న గజన్, గుగులోతు లింబా, గుగులోతు లతాబాయిలకు ఒక్కొక్కరికి రూ.5లక్షల ఆర్థికసాయం చెక్కులు మంజూరు కాగా అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్, ఎంపీడీవో మాలోతు శంకర్, ఆర్ఐ నవీన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దేగావత్ తిరుపతి, నాయకులు గంగం మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

నలుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దుమాల ఎక్స్‌రోడ్డు వద్ద గురువారం సాయంత్రం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శేఖర్ తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకురావాలి

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు ముందుకురావాలని సీఐ మొగిలి పేర్కొన్నారు. మండల కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు విగ్రహాలను ధ్వంసంచేసిన చేయగా పోలీసులు గురువారం ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మొగిలి మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పంచాయతీ పాలకవర్గ సభ్యులు సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలన్నారు. ఇక్కడ ఎస్సై శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అప్పు ఇవ్వనందుకే హతమార్చారు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కరుణాకర్‌రావు

- దేశరాజ్‌పల్లి వివాహిత హత్య కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు

రామడుగు(చొప్పదండి): మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామంలో ఈ నెల 13న మాడిపల్లి అనిత హత్య కేసును పోలీసులు ఛేదించారు. గురువారం రామడుగు పోలీస్‌స్టేషన్‌లో కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు ఘటన వివరాలు వెల్లడించారు. రామడుగు మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన తడగొండ దామోదర్ (మృతురాలికి వరుసకు అల్లుడు) కరీంనగర్‌లో కూలీ పనులు చేసుకుంటూ జల్సాలకు అలవాటుపడ్డాడు. భార్యతో గొడవపడి జులాయిగా తిరిగేవాడు. రూ.30 వేలు అప్పు కావాలని అనితను (ఘటనకు ముందు రోజు ఆదివారం) అడిగాడు. తన వద్ద డబ్బు లేదని సోమవారం రావాలని తెలిపింది. మరుసటి రోజు ఉదయం దామోదర్ అతడి స్నేహితుడు కరీంనగర్‌కు చెందిన శివతో కలిసి ద్విచక్రవాహనంపై అనిత ఇంటికి వెళ్లారు. డబ్బు అప్పు ఇవ్వాలని అడుగగా ఆమె లేవని చెప్పింది. ఈక్రమంలో అనిత ఒక్కతే ఇంట్లో ఉండడాన్ని గమనించిన ఇరువురు ఆమెను బెడ్ రూమ్‌లోకి తీసుకెళ్లి గొంతును చున్నీతో బిగించి చంపివేశారు. తర్వాత ఆమె మెడలోని పుస్తెలతాడు, వెండి పట్టీలు, నల్ల పూసల గొలుసు ఎత్తుకెళ్లారు. పుస్తెలతాడును బంగారు వ్యాపారి వద్ద రూ.20వేలకు తాకట్టు పెట్టి, చేరో రూ.10 వేలు తీసుకున్నారు. కేసులో విచారణ ముమ్మరం చేసిన పోలీసులు గురువారం నిందితుడు దామోదర్ గోపాల్‌రావుపేట నుంచి తిర్మలాపూర్ వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి ద్విచక్రవాహనం, బంగారు గొలుసు, వెండి పట్టీలు స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు జంబోజి శివ పరారీలో ఉన్నాడని త్వరలో పట్టుకుంటామని ఏసీపీ పేర్కొన్నారు. కేసును త్వరగా ఛేదించిన చొప్పదండి సీఐ జి.రవీందర్, రామడుగు, గంగాధర ఎస్సైలు అంజయ్య, రాజు, సిబ్బందిని అభినందించారు. రివార్డు కోసం అధికారులకు నివేదిక పంపిస్తామని తెలిపారు.

ఇసుక డంపులు సీజ్


మల్లాపూర్ శివారులో సీజ్‌చేసిన ఇసుక డంపు

తంగళ్లపల్లి (సిరిసిల్ల): మండలంలోని పలుగ్రామాల శివార్లలో గురువారం పోలీసులు ఇసుక డంపులను సీజ్‌చేశారు. ఈ సందర్భంగా ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మండలంలోని జిల్లెల్ల, మల్లాపూర్, ఇందిరమ్మకాలనీ శివారులో ఆరు ట్రిప్పుల ఇసుక డంపులను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొడుముంజ గ్రామ శివారులో..

వేములవాడ అర్బన్: వేములవాడ మండలం.. కొడుముంజ గ్రామ శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా నిల్వ ఉంచి మూడు ఇసుక డంపులను గురువారం పోలీసులు గుర్తించారు. అనంతరం తహసీల్దార్ రాజుకు అప్పగించినట్లు టౌన్ సీఐ వెంకటేశ్ తెలిపారు.

మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీవో

తంగళ్లపల్లి: మండలానికి మంజూరైన మైనార్టీ కార్పొరేషన్ రుణాల కోసం ఇంటర్వ్యూను గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించగా 25 మంది హాజరైనట్లు ఎంపీడీవో పి.లచ్చాలు తెలిపారు. ఇందుకోసం 105 మంది దరఖాస్తు చేసుకోగా 25 మంది ఇంటర్వ్యూకు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీవో శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమ పూజలు


కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని వాసవీ కన్యాకా పరమేశ్వరీ ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా మహిళలు పారాయణం, కుంకుమ పూజలను ఘనంగా నిర్వహించారు. ఉదయం వేద పండితులు రాచర్ల రఘురామశర్మ, హనుమాండ్ల శర్మ ఆధ్వర్యంలో రుద్ర, పంచ, ముక్త, దేవి సూక్త హవనములు, ప్రసాద వితరణ, మూల మంత్ర హవనం కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రతినిధులు బుచ్చయ్య, ప్రభాకర్, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, చిన్న మల్లేశం, బొమ్మకంటి భాస్కర్, విశ్వనాథం, మురళి, నాగేంద్రం, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


శ్రావణ్ (ఫైల్)

మానకొండూర్: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన రాపాక శ్రావణ్(24) బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. శ్రావణ్ కరీంనగర్‌లో ఓ లేత్ మిషన్‌లో ఆరేళ్లుగా పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. బుధవారం అన్నారంలో జరిగిన బరాత్ కార్యక్రమానికి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. రాత్రివేళ తిరిగి ఇంటికి వస్తుండగా అన్నారం పెట్రోల్‌బంకు సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శ్రావణ్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు రాత్రి ఘటన స్థలానికి చేరుకొని బోరున విలపించారు. గురువారం ఉదయం పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి తల్లి రాజేశ్వరి, తండ్రి ఓదెలు, ఇద్దరు అక్కలు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజకుమార్ తెలిపారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి జైలు

కొత్తపల్లి(కరీంనగర్): జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం వేంపల్లి వెంకట్రావుపేట గ్రామానికి చెందిన పల్లెపు వెంకటస్వామికి విద్యుత్ చౌర్యం కేసులో జైలుశిక్ష పడ్డట్లు విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.స్వామి తెలిపారు. వెంకటస్వామి 2016లో విద్యుత్ చౌర్యం చేస్తూ పట్టుబడగా మొదటి తప్పుగా పరిగణిస్తూ రూ.వెయ్యి జరిమానా విధించి వదిలేశారు. కాగా 2017లో మళ్లీ విద్యుత్ అక్రమంగా వినియోగిస్తూ పట్టుపబడగా కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపర్చారు. జగిత్యాల జిల్లా మొదటి అదనపు కోర్టు న్యాయమూర్తి పల్లెపు వీరయ్య కేసు పూర్వపరాలు పరిశీలించారు. నిందితుడు వెంకటస్వామి విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లు రుజువు కావడంతో ఆరునెలల జైలు శిక్ష లేదా రూ.15,966 చెల్లించాలని తీర్పు చెప్పారు.